క్లుప్తంగా

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముదిగొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కోరం పూర్తయిన వెంటనే సర్వసభ్య సమావేశం ముగించారు. సమావేశంలో తహసీల్దార్ రామారావు, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గేట్ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



రాజేష్

సత్తుపల్లి: అఖిలభారత స్థాయిలో నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్ -2024) ప్రవేశ పరీక్షలో గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి బి.రాజేష్ ప్రతిభ చూపాడు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో 7396వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, హెటిరో అధినేత, ఎంపీ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ట్రస్టీ బండి అన్విద, కళాశాల చీఫ్ కౌన్సిలర్ జవహర్, బ్రాంచ్‌ల విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

తాగునీటి నివారణకు చర్యలు తీసుకోవాలి

ముదిగొండ: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు మంగళవారం తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందించారు. నీటితొట్ల నిర్మాణం చేపట్టడంతో పాటు గ్రామాల్లో నిర్మించిన నీటితోట్లలో నీటిని నింపాలన్నారు. చెరువులలో నీరు లేకపోవడంతో పశువులకు నీరు లేక అల్లాడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం, వైస్ ఎంపీపీ దామోదర్, నాయకులు రాజు, వెంకన్న, భద్రయ్య, రాంచందర్‌రావులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న



అన్నదానం చేస్తున్న దోసపాటి కల్యాణి

మధిర: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు వెలగపూడి హనుమంతరావు, డాలు కృష్ణ అన్నారు. మంగళవారం ఆత్కూరు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద దాతల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దాతలు కల్యాణి, భక్తులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శం

తల్లాడ: భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శమని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ముద్దాల ప్రభాకర్ అన్నారు. తల్లాడలో సత్తెనపల్లి నరేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన డీవైఎఫ్‌ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌వారోత్సవాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు లక్ష్మీనారాయణ, విక్రమ్, అన్వేష్, కిషోర్, సుదాకర్, భాస్కర్, సైదారావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సత్తుపల్లిరూరల్: బేతుపల్లి గంగారం మత్స్యశాఖ సహకార సంఘంలో సభ్యుడైన సోయం రత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. రత్తయ్య కుటుంబానికి అండగా సంఘ సభ్యులు మంగళవారం రూ.9వేలు ఆర్థిక సాయాన్ని అధ్యక్షుడు కన్నారావు, సభ్యులు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం సభ్యులు రామచంద్రరావు, మల్లేశ్వరరావు, శివకృష్ణ, రమేష్, చలమారావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ, రాజేందర్‌రావు, సింగరాజు, కావేటి అప్పారావు, శ్రీను, కరాటే రమేష్, పాల్గొన్నారు.

పేద కుటుంబానికి బియ్యం వితరణ

కారేపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తేజావత్ రవికుమార్ కుటుంబానికి 1.5క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం వితరణగా అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బానోత్ రామ్మూర్తి నాయక్ క్వింటా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల 50 కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలంపల్లి మాజీ సర్పంచ్ ధరావత్ భద్రునాయక్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు కళ్యాణ్, భద్రు, రాందాస్, లక్ష్మణ్, నవీన్, రాంజీ, గోపాల్, వినోద్, వినాయక్, లక్ష్మణ్, ధోనీ, రామ్‌సింగ్, ఠాగూర్, వీరన్న పాల్గొన్నారు.

జీరో బిల్లేది..?

- ఆన్‌లైన్ నమోదులో తప్పిదాలు
- ఎన్నికల కోడ్‌తో మరింత ఇబ్బందులు
- అర్హత ఉన్నా పథకానికి దూరం
- ఇబ్బందుల్లో వినియోగదారులు



కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎదురుచూస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

కొణిజర్ల: గృహజ్యోతి వర్తించక అనేకమంది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. డేటా ఎంట్రీల్లో జరిగిన పొరపాట్లతో విద్యుత్ జీరో బిల్లురాక పరేషాన్ అవుతున్నారు. దీంతో కొణిజర్ల మండల ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

జీరో బిల్లు రాక ఇబ్బందులు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీల్లో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి జీరో బిల్లును ప్రారంభించింది. అయితే ఈ పథకంలో చాలా మంది లబ్ధిదారులకు జీరో బిల్లు రాక ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి తమ పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవడానికి మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ నత్త నడకన నడుస్తుండటంతో తిండీ తిప్పలు లేకుండా ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

మండలంలో 18వేలకు పైగా వినియోగదారులు..

కొణిజర్ల మండలంలో 27 గ్రామపంచాయతీలుండగా సుమారు 18 వేలకు పైగా గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. వీరంతా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది కూడా ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికీ తిరిగి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. మార్చి 1నుంచి ప్రభుత్వం జీరో బిల్లుల మంజూరు ప్రకటించడంతో విద్యుత్ బిల్లింగ్ సిబ్బంది మీటర్ రీడింగ్ తీసి బిల్లులు ఇస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు జీరో బిల్లులకు బదులు బకాయి చెల్లించాల్సిన బిల్లులు రావడంతో లబ్ధిదారులు అవాక్కవుతున్నారు. వీరిలో ఎక్కువగా పేదలు, మధ్యతరగతి వారే ఉన్నారు.

కార్యాలయాల్లో వినియోగదారుల బారులు..

తమకు జీరో బిల్లు రాలేదని కరెంట్ ఆఫీస్‌కు పోతే ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో ఎంపీడీఓ కార్యాలయానికి బారులు దీరుతున్నారు. దీంతో కొద్ది రోజులుగా గ్రామాల వారీగా వందలాది మంది లబ్ధిదారులు కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు తిరిగి ఆన్‌లైన్ చేయించుకుంటున్నారు. విద్యుత్ మీటర్ ఎవరి పేరు మీద ఉందో సదరు వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబ సభ్యులకు ఉచితం వర్తించడం లేదు. మరో వైపు అద్దె ఇంళ్లలో ఉండేవారికి సైతం ఉచిత కరెంట్ బిల్లు రాలేదు. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహిస్తున్నందున సర్వర్ బిజీ అయి ఆన్‌లైన్ ప్రక్రియ బాగా ఆలస్యం అవుతున్నది. దీంతో గంటల తరబడి లబ్ధిదారులు కార్యాలయం వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆన్‌లైన్ చేయిస్తున్నాం..



జీరో బిల్లు రాలేదని ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ప్రతి లబ్ధిదారుడి వివరాలు ఆన్‌లైన్‌లో యుద్ధ ప్రతిపాదికన చేయిస్తున్నాం. నలుగురు సిబ్బంది రెండు కంప్యూటర్‌లలో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇప్పటివరకు 665 దరఖాస్తులు రాగా వాటిలో 457 దరఖాస్తులు పరిష్కరించాం. రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు నంబర్, కరెంట్‌బిల్లు నంబరు తప్పుగా పడ్డ వారికి బిల్లులు రాలేదు. రేషన్ కార్డులు లేని వారి గురించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవు రాగానే చర్యలు తీసుకుంటాం.

– ఏ.రోజారాణి, ఎంపీడీఓ

జీరో బిల్లు రాలేదు..



ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పుడే రేషన్‌కార్డు, కరెంట్ బిల్లు, గ్యాస్‌లకు సంబంధించిన జిరాక్స్‌లు కూడా ఇచ్చాం. కానీ జీరో కరెంట్ బిల్లు రాలేదు. ఎంపీడీఓ ఆఫీస్‌కు పొమ్మంటే వచ్చా. ఉదయం నుంచి ఇక్కడే పడిగాపులు కాస్తున్నా.

– సిలార్ బేగ్, సింగరాయపాలెం

ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహించాలి..



అధికారులు జీరో కరెంట్ బిల్లు రాని వారందరికీ సమాచారం ఇచ్చి పంచాయతీల వారీగా ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహిస్తే బాగుంటుంది. మండలంలోని 27 పంచయతీలలో సుమారు 54 శివారు గ్రామాలున్నాయి. ఉప్పలచలక, గద్దలగూడెం తదితర గ్రామాల ప్రజలు ఎంపీడీఓ కార్యాలయానికి రావాలంటే రెండు రోజులు పనులు మానుకుని రావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధికారులు పరిశీలించాలి.

– తాతా సుధాకర్, టీడీపీ మండలాధ్యక్షుడు

అధికారులు గ్రామాల వారీగా ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహిస్తే సులభంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు: మండలంలోని పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మంగళవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన చంద్రుపట్లకు చెందిన కోటమర్తి కాశీ కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీరామ్‌పురంలో ఇటీవల మృతి చెందిన మారెబోయిన గోపాలకృష్ణ కుటుంబాన్ని, ఎస్ఎస్‌పీలో కీసర చెన్నారెడ్డి కుమారుడు కీసర సతీష్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కల్లూరు పట్టణానికి చెందిన నీలం సుమంత్‌నాయుడు మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. గోపాలకుంటకు చెందిన ముంజల నాగరాజు అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్‌రావు, యాకూబ్‌అలీ, బైర్ల కాంతారావు, బొప్పన శ్రీనాథ్, ఆళ్ళకుంట నరసింహారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యేసు మార్గం అనుసరణీయం..

కల్లూరురూరల్: యేసు మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే రాగమయి అన్నారు. కల్లూరులో యేసు క్రీస్తు సిలువ మార్గ ప్రదర్శన నిర్వహించగా.. ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ ప్రదర్శన కల్లూరు నుంచి పడమరలోకవరం గ్రామ అడవి వరకు పాదయాత్రను చేపట్టారు. కార్యక్రమంలో మండలంలోని అనేక గ్రామాలకు చెందిన క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రేమవిందు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చంద్రరావు, ఏనుగు సత్యబాబు, ఎస్‌కె యాకూబ్ అలీ, బైర్ల కాంతారావు, ఉస్మాన్, భూక్యా శివ నాయక్, బొప్పన శ్రీనాధ్ పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన హనుమాన్‌చాలీసా పారాయణంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ కౌన్సిలర్ నాగళ్ల ప్రసాద్, సామ్రాజ్యంల కుమారుడు వివేక్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల కృష్ణయ్య, గాదె చెన్నారావు, నారాయణవరపు శ్రీనివాస్, నాగళ్ల రామారావు, బొంతు మాధవరావు, వల్లభనేని ప్రవీన్, వై.సాంబశివరావు, కె.నాగేశ్వరరావు, గుడిమెట్ల పద్మనాభరావు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



నగదు అందజేస్తున్న సొసైటీ చైర్మన్, బ్యాంకు మేనేజర్

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీ పరిధిలోని అయ్యవారిగూడెం, భీమవరం గ్రామాలకు చెందిన రైతులు జంగా పుల్లారెడ్డి, కొమ్మిశెట్టి రామారావు ఇటీవల మృతి చెందారు. ఈ రైతుల పేరిట సొసైటీలో గ్రూపు ఇన్సూరెన్స్ చేశారు. వీరి మృతితో ఒక్కొక్కరికి రూ.50 వేలు మంజూరుకావడంతో వారి నామినీలు జంగా కోటేశ్వరమ్మ, కొమ్మిశెట్టి రామారావులకు మంగళవారం మండలకేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్‌లో మేనేజర్ మగినం వీరభదరం, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భానుప్రియ, సూపర్‌వైజర్ మహేష్, సీఈఓ మోహన్‌రావు, సిబ్బంది మురళి, రమణారెడ్డి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

బోనకల్: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘ కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని విశ్వబాహ్మణ, విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల హన్మాండ్లు చారి కోరారు. సంఘం నాయకులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కలిసి వినతులు అందించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి పూర్ణాచారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు భార్గవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సైదాచారి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసాచారి, మండల అధ్యక్షుడు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి విష్ణు చారి, చింతకాని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటాచారి, కోటాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొణిజర్ల: కొణిజర్ల మండలం గుబ్బగుర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామచంద్రాపురం ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల పెద్దరాంపురం, రామచంద్రాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సుంకర స్వాతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోషకాహారం తీసుకోండి



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమాదేవి



వైరారూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లి రూరల్/కల్లూరు/వైరారూరల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, షేక్. బీజాన్బీ, సెక్టార్ సూపర్‌వైజర్లు వి.సుజాత, భవాని, డాక్టర్ కుసుమ తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామం, కాకర్లపల్లితో పాటు కల్లూరులోని బత్తులపల్లి గ్రామంలో, వైరా మండలంలోని అష్టగుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిరు దాన్యాల ఉపయోగం, 3–6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు పూర్వ ప్రాథమిక విద్య గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలల్లో అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, శిరోమణి, లక్ష్మి, సంధ్య, సంధ్యారాణి, నవీన, పుల్లమ్మ, మార్తమ్మ, జయప్రద, వీరవాణి, అరుణాగాంధీ, శ్రీదేవి, రాధ, ఏడ్ల్యూటీ హెచ్.రమాదేవి, ఆశవర్కర్లు కె.అమృత, ఏఎన్ఎం సరోజిని, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

సైలో బంకర్ బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లి: కిష్టారంలోని సింగరేణి సైలో బంకర్ వల్ల నష్టపోతున్న బాధితులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి కిష్టారం అంబేడ్కర్‌నగర్‌లో కాలనీ వాసులతో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం బాధితులను పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి వల్ల భూములు కోల్పోయి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ జీవిస్తున్న కిష్టారం వాసులకు సైలో బంకర్ ఏర్పాటు చేయటంతో ఇంకా తీవ్ర అనారోగ్య సమస్యల బారినపడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాలకుర్తి వీరయ్య, మహిళా సమాఖ్య సత్తుపల్లి డివిజన్ నాయకురాలు ఎస్‌కె రంజాన్‌బి, పాలకుర్తి నాగేశ్వరరావు, పాలకుర్తి రాజు, వాడపల్లి నాగమణి, రామాల నాగమణి, శ్రీవాణి, నాగరత్నం, నిర్మల, మరియమ్మ, జగన్, ప్రభుదాసు, రామకృష్ణ పాల్గొన్నారు.

అవినీతిపరులు కాంగ్రెస్‌లో చేరొద్దు..



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రప్రకాశ్

కారేపల్లి: దళితబంధు, బీసీబంధులో కమీషన్లు తీసుకొని దందాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరితే సహించేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్ అన్నారు. మంగళవారం కారేపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ముడుపులు తీసుకొని ప్రభుత్వ పథకాలను అమ్ముకున్నారని, దీంతో బాధితుల నుంచి సంబంధిత బీఆర్‌ఎస్ నాయకులపై ఒత్తుడులు రావటం, కేసుల వరకు వెళ్లటంతో.. తప్పించుకునే ప్రయత్నంలో ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వస్తున్నారన్నారు. అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ చేర్చుకోదని, మంచి నాయకత్వానికే కాంగ్రెస్ పార్టీలో అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో సురేందర్ మనియార్, ఇమ్మడి తిరుపతిరావు, గోపాల్‌నాయక్, మేదరి టోనీవీరప్రతాప్, హీరాలాల్, భీముడు, వినోద్, హర్షనాయక్, తాజుద్దీన్, సట్టి వీరభద్రం, పాటి నర్సయ్య, హేమ్లానాయక్, షేట్‌రాం, చాంద్‌పాషా, షబ్బీర్, శ్రీను, నరసింహారావు, మల్లేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

‘మిస్ట్’లో ముగిసిన శిక్షణా తరగతులు



శిక్షణ పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: సింగరేణిలో జరిగే ప్రమాదాలకు అందించే ప్రథమ చికిత్స, నైపుణ్యతపై స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మైనింగ్ విద్యార్థులకు మూడురోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారం ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో మెంటార్స్ డాక్టర్ కృష్ణ, శ్రీనివాస్‌లు గనుల్లో జరిగే వివిధ రకాలైన ప్రమాదాల వల్ల గాయపడిన వ్యక్తులకు చికిత్స చేసే విధానం, సీపీఆర్ విధానం, భూగర్భ గనుల్లో ఉన్నవారికి వివిధ ఆక్సీజన్ పరికాల ఉపయోగంపై వివరించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్ సేఫ్టీ గుర్తింపు పొందిన సెయింట్ జాన్ అంబులెన్స్ (ఇండియా) ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, మైనింగ్ విభాగం అధిపతి టి.రాఘవరాజు, అధ్యాపకులు అభినందించారు.


విద్యార్థినికి సైకిల్ వితరణ



రిషితకు సైకిల్ అందిస్తున్న దాతలు

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన గొర్ల ప్రతాపరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, అల్లుడు సతీష్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బెల్జియం సౌజన్యంతో కందుకూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తల్లిదండ్రులు లేని పేద విద్యార్థిని కోటమర్తి రిషితకు రూ.7,200 విలువైన సైకిల్ వితరణగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బొంతు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



చింతకానిలో స్వామి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం

చింతకాని: మండల కేంద్రంలో అత్యంత పురాతనమైన శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 (గురువారం)నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం తొళక్కం ప్రారంభం, దివ్యప్రబంధం, అధ్యయనోత్సవం, శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, ప్రాబోధిక ఆరాధన, సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్రపరాయణం, దివ్య ప్రబంధ సేవాకాలం, శనివారం ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సాయంత్రం నమ్మాళ్వార్లు పరమపదోత్సవం, ఆదివారం ఉదయం మూర్తి కుంభస్థాపన, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హోమం, ధ్వజారోహణం, సాయంత్రం చతుస్థాన అర్చనలు, దేవత ఆహ్వానం, బలిహారణ, సోమవారం శ్రీ భూ, నీలాదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణం తదితర పూజా కార్యక్రమాలను రాత్రి 8 గంటలకు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళవారం స్వామికి గ్రామసేవ, చతుస్థాన అర్చనలు, బలిహారణ, మహా పూర్ణాహుతి, చక్రస్నానం తదితర సేవలతో శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ముగిస్తాయన్నారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీతంపేటలో..

మండల పరిధిలోని సీతంపేట గ్రామంలోని శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి (పానకాల స్వామి) కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి ప్రారంభకానున్న కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు గురువారంతో ముగుస్తాయని ఆలయ సిబ్బంది తెలిపారు.

కోమట్లగూడెంలో..

మండలంలోని కోమట్లగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి అంకమ్మ తల్లి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి జలబిందెలు, పసుపు కుంకుమలు సేకరణ, బియ్యం కొలపట్టుట వంటి పూజా కార్యక్రమాల్ని నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

నేడు శ్రీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని శ్రీసాయిబాబా ఆలయ 10వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సుబ్బారావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోరణాలంకరణ, అనంతరం శ్రీస్వామికి పంచామృతాలతో అభిషేకం, సామూహిక కుంకుమార్చన, శాస్త్రోక్తంగా సాయినాధునికి హారతులు, పల్లకి సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. ఆలయ వార్షికోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.